## డిజిట్-మెరిట్



# 30,000

### కోట్ల రూపాయలు

రాష్ట్రంలోని 1,001 గురుకులాల్లో చదువుతున్న 6.5 లక్షల మంది విద్యార్థులపై ప్రభుత్వం చేసిన ఖర్చు. ఒక్కో విద్యార్థిపై వెచ్చిస్తున్న మొత్తం ఏటా రూ.1.25 లక్షలు.


## థర్డ్ అంపైర్



దశాబ్ది కాలంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో అద్భుతమైన పురోగతి సాధించింది. దేశానికి మార్గదర్శకంగా నిలిచింది. ఈ మాడల్ దేశ వ్యాప్తం కావాలి. అది కేసీఆర్ వల్లనే సాధ్యం. నాయకుడికి ఆలోచనతోపాటు ముందుచూపు ఉండాలి. అవి నాకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌లో కనిపించాయి.

■ గిరిధర్ గమాంగో, ఒడిశా మాజీ ముఖ్యమంత్రి

## థౌజండ్ వాలా..





కౌంట్ డౌన్ 27

# తెలంగాణ జైత్రయాత్ర 2023

హైదరాబాద్ | శుక్రవారం 3 నవంబర్ 2023 నమస్తే తెలంగాణ

I

www.ntnews.com





## తల్లిదండ్రులు పొంగిపోతున్నారు

గత పాలకుల హయాంలో అన్నీ కలిపి రాష్ట్రంలో దాదాపు 270 వరకు గురుకులాలు ఉండేవి. వాటికి నిధులు సక్రమంగా వచ్చేవి కావు. విద్యార్థులకు పురుగులు పట్టిన అన్నం పెట్టేటోళ్లు. తెలంగాణ ప్రభుత్వం ఈ పరిస్థితిని పూర్తిగా మార్చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో 1,001 గురుకులాలు ఉన్నాయి. ఏటా ఒక్కో విద్యార్థి మీద 1.25 లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నాం. గురుకులాల విద్యార్థులు ఎంసెట్, ఐఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షల్లో అద్భుతమైన ర్యాంకులు సాధిస్తున్నారు. ఆ పిల్లలు చక్కగా ఇంగ్లిష్‌లో మాట్లాడుతుంటే తల్లిదండ్రులు పొంగిపోతున్నారు.

■ కేసీఆర్





తెలంగాణ ఉద్యమంతో మట్టిపొరల్లో దాగిన మహోజ్వల చరిత మాణిక్యమై మెరిసింది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత.. మన వైతాళికుల ప్రాభవం దేదీప్యమానంగా వెలిగింది.

అందరం ఒక్కటున్నారు.. మన అస్తిత్వాన్ని గుర్తించలేదు. సరికదా.. చిరఖ్యాతిని మూట గట్టుకున్న మన మహనీయుల జ్ఞాపకాలను చెరిపివేసే ప్రయత్నమూ చేశారు.

అవును.. మనకు తెలియని మన చరిత్రను కండ్ల ముందు ఉంచింది తెలంగాణ ఉద్యమం. మన వీరుల త్యాగాలు, పోరాటాలను సమైక్య పాలకులు తొక్కిపెడితే ఒక్కొక్కటిగా వెలికి తీసి ప్రతి ఒక్కరూ చేతులెత్తి మొక్కేలా చేసింది. ఉద్యమంలో పాశుపతాస్త్రాలైన యోధులకు స్వరాష్ట్రం సగర్వంగా సలాం చేసింది. పాలకుడికి సాహిత్యాభినివేశం.. పోరాట తత్వం.. మంచిని గుర్తించే చిత్తం ఉంటే ఎలా ఉంటుందో కేసీఆర్ పాలనలో నిరూపించారు.


# సాహో నాయకా జయహో వైతాళికా..

- మన వైతాళికులకు వైభవోజ్వల కీర్తి
- యోధులకు సగౌరవ దీప్తి
- విస్మరణకు గురైన వారికి విఖ్యాతి

**'తెలంగాణలో** కవులు లేరు' అని సమైక్యాంధ్ర అహంకారాన్ని సురవరం ప్రతాపరెడ్డి 'ఇదిగో తెలంగాణ అక్షర గవాక్షం' అని 370 మంది కవులతో 'గోల్కొండ కవులు' సంచికను తెచ్చారు. చరిత్రలో శతాబ్దాలుగా, ఉమ్మడి రాష్ట్రంలో దశాబ్దాలుగా మరుగునపడిన మహనీయులను వెలికి తీసి వారి త్యాగాలకు సగౌరవ కీర్తిని కట్టబెట్టారు ముఖ్యమంత్రి కేసీఆర్. భావి తరాలకు స్ఫూర్తినిచ్చారు. తెలంగాణ అస్తిత్వ పతాకలైన ముద్దుబిడ్డల జయంతులు, వర్ధంతులు అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. వారి కీర్తి శాశ్వతంగా నిలిచిపోయేలా విశ్వవిద్యాలయాలకు పేర్లు పెట్టడమే కాకుండా, వారి పేర్ల మీద పురస్కారాలు అందిస్తుండటంతో యావత్ తెలంగాణ ఆ మహానుభావులను ఎల్లప్పుడూ తలుచుకుంటున్నది.

> **మొగలాయి సింహాసనాన్ని సవాలు చేసి.. గోల్కొండ కోటపై బహుజన ధ్వజాన్ని రెపరెపలాడించిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ ముద్దుబిడ్డ. జల్.. జంగల్.. జమీన్.. అని అడవి బిడ్డల గొంతుకై నిలిచిన గోండు వీరుడు కుమ్రం భీం. తెలంగాణ రైతాంగ పోరాటంలో బెబ్బులిలా స్వైరవిహారం చేసి అసువులు బాసిన తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య. ఇలా ఎందరెందరో.. విప్లవ నాయకులు మలిదశ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చారు.**

సర్వాయి పాపన్నగౌడ్. కుమ్రంభీం, నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్, పైడి జయరాజ్, దొడ్డికొమురయ్య, చాకలి ఐలమ్మ వంటి ఎందరో మహానుభావులను కుట్రపూరితంగా భూమిపొరల్లో గతపాలకులు తొక్కిపెట్టారు. ఉద్యమంలో సందర్భం వచ్చినప్పుడల్లా మన పోరాట వారసత్వాన్ని పేర్కొంటూ కేసీఆర్ వారి స్మృతులను గుర్తు చేసేవారు. స్వరాష్ట్రంలో వారికి సమున్నత స్థానం కల్పిస్తామని చెప్పేవారు. అన్నట్టుగానే తెలంగాణ ఆవిర్భావం తర్వాత చరిత్ర మరచిన మహనీయుల స్మృతులను మహోన్నత శిఖరాలపై ప్రతిష్ఠించారు. అందులో భాగంగానే సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తున్నది. ఊరూరా తెలంగాణ వీర శివాజీ అని ఇవ్వాళ సర్వాయి పాపన్న విగ్రహాలు వెలుస్తున్నాయి. కుమ్రం భీం నడయాడిన జోడేఘాట్‌లో రూ.50 కోట్లతో మ్యూజియాన్ని నిర్మించింది. ఒకప్పుడు నిషేధిత ప్రాంతంగా ఉన్న జోడేఘాట్ నేడు పర్యాటక క్షేత్రమై విరాజిల్లుతున్నది. అంతేకాదు, రాజధాని నడిబొడ్డున ఆదివాసీ కుమ్రం భీం భవన్ నిర్మించి ఆ వీరుడికి ఘన నివాళి అర్పించింది బీఆర్ఎస్ ప్రభుత్వం.



### ఉద్యమ దివిటీలకు హారతి

తమ జీవితాంతం తెలంగాణనే శ్వాసించి.. ధ్యానించిన ఈ తరం యోధులను కేసీఆర్ గుండెలకు హత్తుకొని భవిష్యత్ తరాలకు వారధిగా నిలిపారు. తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ పేరుతో వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. కొత్త జిల్లా భూపాలపల్లికి ప్రొఫెసర్ జయశంకర్-భూపాలపల్లిగా నామకరణం చేశారు. జయశంకర్ సార్ పార్థివదేహానికి తెలంగాణ సమాజం నివాళులు అర్పించిన ఏకశిలా పార్కుకు ఆ మహనీయుడి పేరే పెట్టారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయానికి జయశంకర్ సారు పేరును పెట్టారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగాలను గుర్తుచేసుకుంటూ ఉద్యాన విశ్వవిద్యాలయానికి ఆయన పేరును పెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ గొంతుగా నిలిచిన సదాలక్ష్మి, ఈశ్వరీబాయి జయంతులను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నది. సమైక్యపాలకుల నీటి కుట్రలను ఎండగట్టిన 'నీళ్ల మనిషి' ఆర్.విద్యాసాగర్ రావు కీర్తి శాశ్వతంగా నిలిచిపోవాలని డిండి ప్రాజెక్టుకు ఆయన పేరును ఖరారు చేశారు. మల్కాపేట రిజర్వాయర్‌కు కమ్యూనిస్టు యోధుడు చెన్నమనేని రాజేశ్వర రావు పేరును పెట్టారు. ఉద్యమంలో కేసీఆర్ వెంట నడిచిన కార్మిక నేత, నాయిని నర్సింహారెడ్డి జ్ఞాపకార్థం హైదరాబాద్ ఇందిరాపార్కు నుంచి వీఎస్టీ వరకు నిర్మించిన ఉక్కువంతెనకు ఆయన పేరు పెట్టింది. మలి దశ ఉద్యమంలో తొలి అమరుడు శ్రీకాంతాచారి త్యాగాన్ని నిత్యం స్మరించుకునేలా హైదరాబాద్ ఎల్బీ నగర్ కూడలిని శ్రీకాంతాచారి చౌరస్తాగా కేసీఆర్ ప్రభుత్వం నామకరణం చేసింది. ఇలా మన త్యాగధనులను భావితరాలు గుర్తుంచుకునేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడం ముదావహం.

... నూర శ్రీనివాస్

### ■ పీవీ మన ఠీవి

**నడి** సంద్రంలో మునుగుతున్న భారత ఆర్థిక నావకు సంస్కరణల తెరచాప కట్టి ఒడ్డుకు తెచ్చిన మేధావి మన పీవీ నర్సింహారావు. ముఖ్యమంత్రి, పలు దఫాలుగా కేంద్రమంత్రి, ప్రధానమంత్రిగా పనిచేసి దేశ, విదేశాల్లో భారతకీర్తి ప్రతిష్ఠలను పెంచిన పీవీని కాంగ్రెస్ నిర్దాక్షిణ్యంగా విస్మరించింది. ఇప్పటిదాకా ప్రధానమంత్రులుగా పనిచేసి మరణించిన వారందరికీ ఢిల్లీలో సమాధులు (ఘాట్‌లు) నిర్మించింది. కానీ, కేంద్రంలో యూపీఏ-1 ప్రభుత్వం ఉన్నా పీవీ భౌతిక దేహాన్ని హైదరాబాద్‌కు తీసుకొచ్చి అంతిమ సంస్కారాలు నిర్వహించుకోవాల్సిన దుస్థితిని కాంగ్రెస్ కల్పించింది. అరకొర ఏర్పాట్ల కారణంగా ఆ రాజనీతిజ్ఞుడి పార్థివదేహం పూర్తిగా కాలకపోవడం.. తెలంగాణ బిడ్డకు కాంగ్రెస్ ఇచ్చిన గౌరవం ఏపాటిదో తేటతెల్లం చేస్తున్నది. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 'పీవీ మన ఠీవీ' అని సీఎం కేసీఆర్ సగర్వంగా ప్రకటించారు. పీవీ శతజయంతి ఉత్సవాన్ని ఏడాదంతా సగర్వంగా నిర్వహించారు. పీవీకి నిలువెత్తు విగ్రహం పెట్టి ఆయన కీర్తి కిరీటంలో కలికితురాయి తొడిగింది బీఆర్ఎస్ ప్రభుత్వం.




### అందరికీ వందనం

- బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ పేరిట హైదరాబాద్‌లో బంజారాభవన్ నిర్మించింది.
- తన భూమి కోసం నిజాం రాజును ఎదిరించిన చాకలి ఐలమ్మ వర్ధంతిని అధికారికంగా చేస్తున్నది.
- సాయుధపోరాట వీరుడు దొడ్డి కొమురయ్య పేరుమీద మెమోరియల్ భవన్ నిర్మించ తలపెట్టింది.
- బాలీవుడ్‌లో హీరోగా మెరిసిన తెలంగాణ కథానాయకుడు పైడి జయరాజ్ స్మృత్యర్థం రవీంద్రభారతిలోని మినీ ఆడిటోరియానికి ఆయన పేరు పెట్టింది.

## ప్రజాకవులకు పబ్బతి

**'తెలంగాణ** విడిపోతే దేశానికి ఆపత్తా.. రూపాయికి పైసలు నూరు కాకపోతాయా?' అని నినదించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు ఈ గడ్డకు నిత్యస్మరణీయులు. అలాగే 'నా తెలంగాణ కోటి రతనాల వీణ'.. 'అన్నార్తులు, అనాథలుండని ఆ నవయుగమదెంతదూరం' అని పల్లవించిన దాశరథి కృష్ణమాచార్య ప్రాతఃస్మరణీయులు. ఈ ప్రజాకవులంటే సీఎం కేసీఆర్‌కు వల్లమాలిన ప్రేమ. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచీ ప్రజాకవి కాళోజీ, దాశరథి జయంతి, వర్ధంతులను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నది. వారి పేరిట ఏటా పురస్కారాలను అందజేస్తూ కవి పండితులను గౌరవిస్తున్నది. కాళోజీ పార్థివదేహాన్ని దానంగా అందజేసిన చోట నిత్యస్మరణ కొనసాగాలని కాకతీయ మెడికల్ కాలేజీని విశ్వవిద్యాలయంగా మార్చి దానికి కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంగా స్వయంగా కేసీఆరే నామకరణం చేశారు. హనుమకొండలో రూ. 50 కోట్లతో కాళోజీ కళాకేంద్రాన్ని నిర్మిస్తున్నారు. ఆ మహనీయుడి జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించింది ప్రభుత్వం. జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డితో కేసీఆర్‌కు ప్రత్యేక అనుబంధం ఉన్నది. సినారె కాలం చేసినప్పుడు ప్రభుత్వం అధికార లాంఛనాలతో అంతిమ సంస్కారం నిర్వహించింది. ముఖ్యమంత్రి స్వయంగా ఆ కవి వైతాళికుడి పాడెను మోసి కవులపై తనకున్న భక్తిని చాటుకున్నారు. గోల్కొండ పత్రిక సంపాదకులు సురవరం ప్రతాపరెడ్డి జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తున్నది. సంస్కృత భాషాకోవిదుడు మల్లినాథ సూరి పేరిట మెదక్ జిల్లా కొల్చారంలో మల్లినాథ సంస్కృత విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నది.





## మీమ్ ఫైర్స్



### 'మోస్ట్ ఇర్రెస్పాన్సిబుల్ యాటిట్యూడ్ అంటరు దీన్ని'


**దేశానికి** స్వతంత్రం తెచ్చిందే మేము. భూమి పుట్టినప్పటి నుంచి పరిపాలన మాకు తెలుసు... అని చెప్పుకుంటూ ఉంటుంది కాంగ్రెస్ పార్టీ. కానీ మ్యానిఫెస్టోలు తయారు చేసేటప్పుడు మాత్రం నిన్న మొన్న పెట్టిన పార్టీల కన్నా అధ్వానంగా ఆలోచిస్తుంది. వాటి అమలు సాధ్యాసాధ్యాల సంగతి ఆ పార్టీకి పట్టదు. మొన్నటికి మొన్న కర్ణాటకలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా అలవికాని హామీలెన్నో ఇచ్చింది. ప్రజలకు అరచేతిలో



వైకుంఠం చూపించింది. తీరా అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడవక ముందే 'మేమిచ్చిన ఐదు హామీలు నెరవేర్చితే ఖజానా ఖాళీ అయిపోతుంది. ప్రభుత్వాన్ని నడపలేం' అని ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రే చేతులెత్తేశారు. వ్యవసాయానికి ఏడు గంటల విద్యుత్తు ఇస్తామన్న వాళ్లు అప్పుడే అయిదు గంటలంటూ ప్లేటు ఫిరాయించారు. మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణానికి కొత్తగా షరతులు వర్తిస్తాయంటున్నారు. ఇదే పార్టీ ఏలుబడిలో ఉన్న హిమాచల్ ప్రదేశ్‌లో ఏకంగా పది హామీలు ఇచ్చింది. పీఠమెక్కి ఏడాది గడిచినా ఒక్కదాన్నీ అమలు చేయలేదు. తాము ఇచ్చే హామీలు నెరవేర్చడం ఏ రకంగానూ వీలుపడదని పదేపదే ఆ పార్టీకి అనుభవం అవుతున్నా... మళ్లీ తెలంగాణ ఎన్నికల్లో గ్యారంటీల వర్షం కురిపిస్తున్నది. ఒక్క చాన్స్ ఇస్తే ఇవన్నీ నెరవేరుస్తామని నమ్మబలుకు తున్నది. దింపుడు కల్లం ఆశ మీదున్న హస్తం పార్టీ అధికారం కోసం ఇలా ఆపద మొక్కులు ప్రకటిస్తున్నది. ఈ పద్ధతిని ఏమనాలి. మన కేసీఆర్ సార్ చెప్పినట్టు 'మోస్ట్ ఇర్రెస్పాన్సిబుల్ యాటిట్యూడ్ అంటరు దీన్ని' అని కాంగ్రెస్ పట్ల తెలంగాణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

■ హరిత

## ఎటమటం!




### పని పాతర పెట్టి..

**కర్ణాటకలో** ఒకపక్క తాగునీరు, సాగునీరు, విద్యుత్తు కోసం ప్రజలు అల్లాడిపోతుంటే, ఘనత వహించిన కాంగ్రెస్ ప్రభువులు మాత్రం, పని పాతర పెట్టి జాతరకు వెళ్లిందన్న నానుడిని గుర్తుకు తెచ్చే పనులు చేస్తున్నారు. ఎవరి మెడలో అయినా పులి గోర్లు ఉన్నాయా? ఎవరి ఇంట్లో అయినా పులిచర్మం మీద కూర్చొని పూజలు చేస్తున్నారా?... అని అటవీ, పోలీసు శాఖలు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీలు నిష్పాక్షికంగా జరుగుతున్నాయని నమ్మించడానికి అధికార పార్టీ ఎమ్మెల్యే కుమారుడిని కూడా అరెస్టు చేశారు. దీంతో... ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నుంచి దృష్టిని పులిగోర్ల మీదికి మళ్లించే ఆలోచన సక్సెస్ కావడంతో, సీఎం సిద్ధరామయ్య ఇంట్లో కూర్చొని క్రికెట్ మ్యాచ్ చూస్తూ రిలాక్స్ అవుతున్నారని విపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి.

■ సీఎస్వీ